సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



ఇంటర్‌లో 'కేజీబీవీ' ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఉత్తమ మార్కులు సాధించిన వారిని డీఈవో అభినందించారు.

- IIలో ▸



మృతదేహంతో ఆందోళన

తన భర్త మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ బంధువులతో కలిసి నిందితుల ఇంటి ఎదుట ఆందోళన చేసింది.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.4 /27.3

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కౌంటింగ్ సెంటర్ పరిశీలన



డిచ్‌పల్లి: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ గురువారం డిచ్‌పల్లిలోని ఓట్ల లెక్కింపు కేంద్రమైన సీఎంసీ కళాశాలను సందర్శించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోల్ అయ్యే ఓట్ల లెక్కింపుతో పాటు నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కూడా సీఎంసీలోనే చేపట్టనున్నారని అధికారులు వివరించారు. డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను, ఆయా సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు గదులు, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేసిన ఏర్పాట్లను ఎలిస్ వజ్ ఆర్ పరిశీలించారు. ఆమె వెంట జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, మెప్మా పీడీ రాజేందర్, విజయేందర్ రెడ్డి తదితరులున్నారు.

బోధన్ డిగ్రీ కాలేజీకి స్వయం ప్రతిపత్తి



బోధన్: బోధన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి యూజీసీ స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ వెల్లడించారు. గురువారం కళాశాలలో అధ్యాపకులతో కలిసి ఆయన మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి 2028–29 వరకు ఐదేళ్ల పాటు స్వయం ప్రతిపత్తి హోదాను యూజీసీ కల్పించిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా ఉందని, ఇప్పుడు బోధన్ కళాశాలకు ఆ హోదా దక్కిందని పేర్కొన్నారు. ఈ హోదాతో అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఉద్యోగ, నైపుణ్యాధార కోర్సులను ప్రవేశపెట్టే అధికారం కళాశాలకు ఉంటుందని వివరించారు.

ఎంబీబీఎస్ ఫలితాలు విడుదల

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల 2021 ఎంబీబీఎస్ బ్యాచ్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు. మొత్తం 104 విద్యార్థులు పరీక్షలు రాయగా 95 మంది ఉత్తీర్ణత సాధించారు.

జహీరాబాద్‌లో 69 నామినేషన్‌లు

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి 40 మంది అభ్యర్థులు 69 సెట్ల నామినేషన్లు వేశారు. గురువారం ఆఖరి రోజు 35 దాఖలయ్యాయి. సంగారెడ్డి కలెక్టర్, రిటర్నింగ్ అధికారి క్రాంతి నామినేషన్లు స్వీకరించారు.

సీపీఆర్‌పై అవగాహన



నిజామాబాద్‌నాగారం: నగరంలో గురువారం విద్యుత్ ఉద్యోగులకు గుండె వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే అందరికి సీపీఆర్ శిక్షణపై అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ రాజేందర్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులు ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగానే గుండెవ్యాధులతో మరణిస్తున్నారని అందుకు రెడ్‌క్రాస్ సహకారంతో గుండె వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. డీఈటీ వెంకటరమణ, ఏడీలు తోట రాజశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కమలం గుర్తుకు ఓటు వేయాలని చూపుతున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, ఎంపీలు లక్ష్మణ్, అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి

ఇందూరు కేంద్రంగానే పసుపు బోర్డు

- అర్వింద్‌ను మళ్లీ ఎంపీగా గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలి
- చక్కెర కర్మాగారాన్ని తెరిపించే బాధ్యత మాదే
- ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి
- కాంగ్రెస్ పార్టీవి దిగజారుడు రాజకీయాలు : ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



సుభాష్‌నగర్: ఇందూరు కేంద్రంగానే పసుపు బోర్డు కార్యకలాపాలు కొనసాగుతాయని, నాలుగు దశాబ్దాల పసుపు బోర్డు హామీని మోదీ నెరవేర్చారని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి పేర్కొన్నారు. మూతపడిన నిజాం, సారంగాపూర్ చక్కెర కర్మాగారాలను తెరిపించే బాధ్యత తమదేనని అన్నారు. గురువారం బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి నామినేషన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా చేయడానికి మనమందరం సంకల్పిద్దామని కోరారు. అందుకోసం నిజామాబాద్‌లో అర్వింద్‌ను మళ్లీ గెలిపించి మోదీ నాయకత్వాన్ని బలపరుద్దామన్నారు. కాంగ్రెస్ పాలన మొత్తం అవినీతిమయం అని విమర్శించారు. ముస్లిం పర్సనల్ లా బోర్డును అమల్జేసేందుకు కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతోందని, మోదీ పాలనలో ఒకే దేశం, ఒకే న్యాయం అమలవుతోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులను మైనారిటీల సంక్షేమం కోసం వాడుతారని ఆయన ఆరోపించారు.

అర్వింద్ గెలుపు ఖాయం



నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి విజయం ఖాయమని, గతంలో కంటే ఎక్కువ మెజారిటీ కోసం పని చేయాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని, ఓట్ల కోసం ముస్లింల జపం చేస్తోందని ఆరోపించారు. బీసీ, ఎస్సీల్లో ముస్లింలను చేర్చి వారి పొట్ట కొట్టాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే అర్వింద్‌కు ఓటేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లిక్కర్ స్కామ్‌లో జైల్లో ఉన్న కవితకు ఎందుకు బెయిల్ ఇవ్వరని ప్రస్టేషన్‌లో న్యాయస్థానాలను ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. మోదీ పనితీరుపై మాట్లాడే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు.




సీఎం రేవంత్‌రెడ్డివి అబద్ధపు హామీలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలు ఇవ్వడమే కాకుండా వాటిని అమలు చేస్తామని హిందూ దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని, ఆయనకు దమ్ముంటే ఇతర మతాల దేవుళ్లపై ఒట్టు వేయాలని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ సవాల్ విసిరారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో అవినీతి లేకుండా రూ.వేల కోట్లతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీగా ఐదేళ్లలో ఏనాడూ నిజామాబాద్‌కు రాలేదన్నారు. చక్కెర ఫ్యాక్టరీలు తెరిపించేందుకు వేసిన కమిటీల్లో సభ్యుడిగా ఉండి వాటిని తెరిపించలేకపోయారని విమర్శించారు. ఇందూరులోనే పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన పసుపు బోర్డు హామీ సహా అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. తనను గెలిపిస్తే రైల్వే లైన్ల పెంపునకు కృషి చేస్తానని, జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు పూర్తి చేస్తామని, చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరిస్తామని హామీలిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థులపై మాట్లాడే సమయం లేదన్నారు. ఈ సందర్భంగా సీఎం పుష్కర్‌సింగ్ ధామికి నాగలి, పుష్ప గుచ్ఛాలు అందించి సన్మానించారు. అంతకుముందు ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, ఏలేటి అన్నపూర్ణమ్మ, వడ్డి మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, బోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ప్రసంగించారు. సమావేశంలో పార్లమెంట్ ప్రభారీ వెంకట రమణి, నాయకులు లోక భూపతిరెడ్డి, బద్దం లింగారెడ్డి, సత్యనారాయణ రావు, మల్లికార్జున్ రెడ్డి, పాట్కూరి తిరుపతిరెడ్డి, గద్దె భూమన్న, పద్మారెడ్డి పాల్గొన్నారు.

విభిన్నం బాల్కొండ ఓటర్ల తీర్పు

- ఒక్కో ఎన్నికలో ఒక్కో పార్టీకి పట్టం
- రాజకీయ నాయకుల అంచనాలకు అందని ప్రజల నాడి



మోర్తాడ్: రాజకీయ నాయకుల అంచనాలను తలకిందులు చేస్తూ బాల్కొండ నియోజకవర్గ ఓటర్లు ఒక్కో ఎన్నికలో ఒక్కో పార్టీకి పట్టం కడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక పార్టీని గెలిపిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో మరో పార్టీకి మెజారిటీ ఇస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం రాజకీయ పార్టీల అంచనాలను తలకిందులు చేస్తూ విలక్షణ తీరును ప్రదర్శిస్తున్నారు.

- 2023 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే బాల్కొండ ఓటరు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించారు. ఆ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మూడోసారి గెలిచిన ప్రశాంత్‌రెడ్డికి 70,417 ఓట్లు లభిస్తే రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డికి 65,884 ఓట్లు వచ్చాయి.
- 2018 ఎన్నికల్లో 32,459 ఓట్ల మెజారిటీతో జిల్లాలో అందరు ఎమ్మెల్యేల కంటే ఎక్కువ మెజారిటీని ప్రశాంత్‌రెడ్డి దక్కించుకున్నారు. కాంగ్రెస్‌కు 30,135 ఓట్లు లభిస్తే రెండో స్థానంలో బీఎస్పీ నుంచి పోటీ చేసిన సునీల్‌రెడ్డి నిలిచారు. బీఎస్పీకి ఈ ఎన్నికల్లో అనూహ్యంగా 41,079 ఓట్లు లభించాయి.
- 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 5వేల ఓట్లే వేసిన ఓటర్లు కేవలం నాలుగు నెలల తేడాలోనే తమ తీర్పును మార్చారు. 2014 స్థానిక సంస్థల ఎన్నికల్లో మోర్తాడ్ ఎంపీపీ స్థానంను కాంగ్రెస్ పార్టీ దక్కించుకునేలా ఓటర్లు తీర్పు ఇచ్చారు. మిగిలిన మండలాల్లోను కాంగ్రెస్, బీజేపీ తమ బలంను నిరూపించుకున్నాయి.
- 2019 జనవరిలో జరిగిన సర్పంచ్‌ల ఎన్నికల్లో నియోజకవర్గంలో మెజారిటీ గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలుచుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టినా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకలా, పార్లమెంట్ ఎన్నికల్లో మరోలా తీర్పునిచ్చిన ఓటర్లు తమ వైఖరి ఏమిటో ఎవరికి అంతుచిక్కకుండా చేశారు. ఇలా ఒక్కో ఎన్నికలో ఒక విధమైన తీర్పును ఇస్తూ బాల్కొండ ఓటరు తమ ప్రత్యేకతను ప్రదర్శిస్తూనే ఉన్నాడు.

- 2014 ఎన్నికల్లో 36,248 ఓట్ల మెజారిటీని ప్రశాంత్‌రెడ్డి సాధించుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి కేవలం 32,897 ఓట్లు మాత్రమే లభించాయి.
- 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టిన బాల్కొండ ఓటర్లు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో తమ తీర్పును మార్చి రాశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు 67,170 లభించాయి. కొద్ది నెలల తేడాలోనే బీఆర్ఎస్‌కు మెజారిటీ తగ్గించి బాల్కొండ ఓటర్లు తమ విలక్షణతను చాటుకున్నారు. పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కవితకు 55,439 ఓట్లతోనే సరిపెట్టారు. బీజేపీకి 11,731 ఓట్లు ఎక్కువ వేశారు.

42 మంది అభ్యర్థులు.. 90 నామినేషన్లు

- ముగిసిన నామినేషన్ల పర్వం..
- చివరి రోజు 28 నామినేషన్లు దాఖలు
- నేడు నామినేషన్ పత్రాల పరిశీలన



నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్, చిత్రంలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, ఎంపీ లక్ష్మణ్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కీలకఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి మొత్తం 42 మంది అభ్యర్థులు 90 నామినేషన్లను దాఖలు చేశారు. చివరిరోజు 28 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు అర్వింద్ ధర్మపురి, తాటిపర్తి జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్దన్ నాలుగు సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలు సమర్పించారు. మిగతా పార్టీలు సహా స్వతంత్ర అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ సెట్ల నామినేషన్లు వేశారు.

బీజేపీ అభ్యర్థి అర్వింద్ తన నాలుగో సెట్ నామినేషన్ పత్రాలను ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డితో కలిసి జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించారు. నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి ఈనెల 18 నుంచి నామినేషన్లు స్వీకరించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గానికి 185 నామినేషన్లు దాఖలు కాగా, అందులో 178 మంది పసుపు రైతులు నామినేషన్లు వేశారు. ప్రస్తుతం 42 మంది అభ్యర్థులు నామినేషన్లు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలనను చేపట్టనున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా దాఖలు చేసిన అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరిస్తారు. స్క్రూటినీలో తిరస్కరించిన తర్వాత జాబితాను రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. ఈ నెల 30 నుంచి బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచారం హోరెత్తనుంది.

'ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేస్తాం'

సుభాష్‌నగర్: ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేసి.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచుతామని నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పులకు వ్యతిరేకమని, ఇది బీజేపీ స్టాండ్ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఆరు గ్యారంటీలపై మాట్లాడమంటే.. బీజేపీపై చార్జిషీట్ అంటూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశాన్ని ముస్లింలకు అప్పగించే విధంగా కాంగ్రెస్ మేనిఫెస్టో ఉందన్నారు. రాష్ట్రంలోని చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన కమిటీ తన నివేదికలో 2025 డిసెంబర్లో తెరిపిస్తామని పేర్కొనగా.. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నిజామాబాద్ సభలో సెప్టెంబర్ 17న తెరుస్తామని ప్రకటించారన్నారు. సీఎం, కమిటీ తలో మాట చెబుతూ మరోసారి చెరుకు రైతులను మోసం చేసే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, సత్యనారాయణ రావు, నాయకులు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

నిజామాబాద్‌నాగారం: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని డీఎంహెచ్‌వో సుదర్శనం సూచించారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వినాయకనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఆరోగ్య కేంద్రంలో మలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. గత ఏడాది నుంచి జిల్లాలో ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదన్నారు. పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రై డే, రక్తపూతల సేకరణ లాంటి కార్యక్రమాలతో ఇది సాధ్యమైందన్నారు. మలేరియా నివారణ చర్యలు వివరించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి తుకారం రాథోడ్ మాట్లాడుతూ మలేరియా నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అజ్మతున్నీసా బేగం, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, హెచ్ఈవో వెంకట్, రవి, శ్రీనివాస్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

డిగ్రీ, పీజీ కళాశాలల్లో తనిఖీలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2024–25 విద్యాసంవత్సరానికిగాను యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు కోసం డిగ్రీ, పీజీ కళాశాలల తనిఖీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని నిశిత డిగ్రీ అండ్ పీజీ, నిశిత కామర్స్ కళాశాలలతోపాటు సీఎస్ఐ, విశ్వశాంతి డిగ్రీ కళాశాలల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందూరు ఉషోదయ మహిళా డిగ్రీ కాలేజ్, టీఎస్ ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్‌లో తెలంగాణ యూనివర్సిటీ ఆడిసెల్ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగాయి. ముఖ్యంగా యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీ నిబంధనల మేరకు వసతులు, సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. సొంత భవనం, ల్యాబ్‌లు, లైబ్రరీ, అర్హత కలిగిన అధ్యాపకులు, తరగతి గదులు, క్రీడామైదానం, పార్కింగ్, ఫైర్ సేఫ్టీ, శానిటేషన్ అనుమతులను పరిశీలించారు. సిబ్బందికి చెల్లిస్తున్న ఆన్‌లైన్ పేమెంట్ రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. కొన్ని కళాశాలల వారికి నోటీసులు అందజేసి నెలరోజుల్లోగా సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో అనుబంధ గుర్తింపు రద్దు చేస్తామని ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆడిట్‌సెల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ, డీన్స్ రాంబాబు, అపర్ణ, ఆరతి, లావణ్య, మేనేజ్‌మెంట్ విభాగం ఆంజనేయులు, కంప్యూటర్ సైన్స్ హెడ్ అంబిక పాల్గొన్నారు.



నిశిత కళాశాలలో తనిఖీ నిర్వహిస్తున్న తెయూ ఆడిట్ సెల్ అధికారులు

క్లుప్తంగా

కొనసాగుతున్న బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మెదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. గురువారం నిర్వహించిన పరీక్షలకు 412 మంది విద్యార్థులకుగాను 388 మంది హాజరు కాగా, 24 మంది గైర్హాజరయ్యారన్నారు.

మూగజీవాల దాహార్తిని తీర్చాలి

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మూగజీవాలు వేసవి తాపానికి గురికాకుండా వీధుల్లో, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో వాటికోసం తాగునీటి సౌకర్యం కల్పించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి ప్రజలను కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండుటెండల నేపథ్యంలో పశువులు, కుక్కలు, పక్షులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తాగునీటి వసతి కల్పించి దాహార్తిని తీరిస్తే మూగ జీవాలను కాపాడినవారమవుతామని పేర్కొన్నారు. ప్రజలతోపాటు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వీధుల్లో మూగ జీవాల కోసం తాగునీరు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన విద్యా సంస్థల చైర్మన్‌



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌కు చెందిన విజయ్‌ రూరల్‌ ఇంజినీరింగ్‌ కళాశాల చైర్మన్‌ కె.నరేందర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో సీఎంను నరేందర్‌రెడ్డి కలిశారు. జాఫర్‌ఖాన్‌, అద్నాన్‌ఖాన్‌ తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు.

ప్రశాంతంగా ‘ఓపెన్‌’ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ ఇంటర్‌, పదో తరగతి పరీక్షలు మొదటి రోజైన గురువారం ప్రశాంతంగా కొనసాగాయి. పదో తరగతి పరీక్షకు 1017 మందికిగాను 910 మంది హాజరుకాగా, 107 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 1490 మందికిగాను 1340 మంది హాజరుకాగా, 150 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షల్లో ఇంటర్‌ అరబిక్‌ పరీక్షకుగాను 23 మంది పరీక్షకు హాజరయ్యారు. పలు పరీక్షాకేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్‌ తనిఖీ చేశారు.

‘జేఈఈ’లో జిల్లాకు జాతీయ ర్యాంకులు


తేజస్విని, 967వ ర్యాంక్‌, కాకతీయ


కేతన, 1220వ ర్యాంక్‌, కాకతీయ


హృదయ్‌, 98.76 పర్సంటైల్‌, వెక్టర్‌


సహర్ష, 94.33 పర్సంటైల్‌, వెక్టర్‌


మిన్హాజ్‌, 99.68 పర్సంటైల్‌, కాకతీయ


సుప్రిత్‌, 99.41 పర్సంటైల్‌, కాకతీయ


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కాకతీయ కళాశాల డైరెక్టర్‌ రామోజీరావు, సిబ్బంది

- విద్యార్థులను అభినందించిన కాకతీయ యాజమాన్యం
- సత్తాచాటిన ఎస్‌ఆర్‌, నారాయణ కళాశాలల విద్యార్థులు


శివప్రథమ్‌, 99.22 పర్సంటైల్‌, కాకతీయ


ఏ.మలిక్‌, 98.30 పర్సంటైల్‌, కాకతీయ


ఏ.హదీ, 98.22 పర్సంటైల్‌, కాకతీయ


ఏ.నందిని, ఎస్టీ విభాగం 12వ ర్యాంక్‌, ఎస్‌ఆర్‌

నిజామాబాద్‌అర్బన్‌: జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్‌ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారు. కాకతీయ కళాశాలకు చెందిన తేజస్విని జాతీయస్థాయిలో 967వ ర్యాంక్‌, ఇదే కళాశాలకు చెందిన కేతన 1220 జాతీయ ర్యాంకు సాధించింది. మిన్హాజ్‌ 99.68 పర్సంటైల్‌, ఎం.సుప్రిత్‌ 99.41 పర్సంటైల్‌ , బి.శివప్రథమ్‌ 99.22, ఏ.మలిక్‌ 98.30, ఏ.హదీ 98.20 పర్సంటైల్‌ సాధించారు. కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. 50 మంది జాతీయ స్థాయిలో ఐఐటీ అడ్వాన్స్‌డ్‌ పరీక్షకు అర్హత సాధించారని కళాశాల డైరెక్టర్‌ సీహెచ్‌ రామోజీరావు తెలిపారు. ఇంటర్‌ ఫలితాల్లోనూ తమ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను యాజమాన్యం గురువారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా రామోజీరావు మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయి ర్యాంకులు సాధించడం తెలంగాణకే గర్వకారణమన్నారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులతోపాటు అందుకు కారణమైన అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లోనూ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కళాశాలకు ప్రిన్సిపల్‌ రణదీశ్‌, సందీప్‌, వైస్‌ప్రిన్సిపల్‌ శ్యాం, జ్యోత్స్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ఎస్‌ఆర్‌ కళాశాలకు చెందిన విద్యార్థులు జే ఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎస్టీ విభాగంలో అంగోత్‌ నందిని 12వ ర్యాంకు, ఎస్టీ విభాగంలో రాథోడ్‌ ప్రవీణ్‌కుమార్‌ 1514 ర్యాంకు, ఓబీసీ విభాగంలో శ్రేయేశ్‌కుమార్‌ 5047వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఎస్సీ విభాగంలో తలారి రిషిరాజ్‌ 5,617వ ర్యాంకు, వంశీకృష్ణ 8123వ ర్యాంకు సాధించారు. జనరల్‌ విభాగంలో శ్రీవల్లి 9361వ ర్యాంకు, ఓసీ విభాగంలో కె.భావ్య 9745వ ర్యాంకు సాధించారు. విద్యార్థులను డీజీఎం గోవర్ధన్‌రెడ్డితోపాటు కళాశాల జోనల్‌ ఇన్‌చార్జి శ్రీకాంత్‌, హన్మంతరావు, మహిపాల్‌రెడ్డి తదితరులు అభినందించారు.

నారాయణ విద్యార్థులు..

జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో నారాయణ జూనియర్‌ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్‌ లక్ష్మారెడ్డి తెలిపారు. ఆల్‌ ఇండియా ఓపెన్‌ కేటగిరిలో మద్రి హర్ష 848వ ర్యాంకు సాధించగా, 28 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు వివరించారు. 28 మంది విద్యార్థులు మూడు వేలలోపు ర్యాంకులు సాధించారన్నారు.

వెక్టర్‌ కళాశాల..

జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో వెక్టర్‌ కళాశాలకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన హృదయ్‌ 98.76 పర్సంటైల్‌, బత్తుల సహర్ష 94.33 పర్సంటైల్‌, సాయిదుర్గ 94.20 పర్సంటైల్‌ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్‌ మధుసూదన్‌ తెలిపారు. 17 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివి..

జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. ప్రణాళికాబద్ధంగా చదివి ర్యాంకులు సాధించిన విద్యార్థుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి..

– నిజామాబాద్‌అర్బన్‌

ఐఏఎస్‌ అవుతా



భవిష్యత్‌లో ఐఏఎస్‌ ఆఫీసర్‌ను అవుతా. దానికి తగినట్లుగా ప్రణాళికతో చదువుతున్నాను. ప్రస్తుతం జాతీయ స్థాయి ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. మరిన్ని ర్యాంకులు సాధించి నా లక్ష్యాన్ని సాధిస్తాను. ప్రజలకు సేవ చేయలన్నదే నా తపన.

– అంగోత్‌ నందిని, ఎస్‌ఆర్‌కళాశాల

ప్రతి సబ్జెక్టుపై అవగాహన



జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించాలని ముందుగానే నిర్ణయించుకున్నాను. దానికి తగినట్లుగా అనుభవజ్ఞులైన కళాశాల అధ్యాపకుల సహాయంతో ప్రణాళిక రూపొందించుకున్నాను. ప్రతి సబ్జెక్టుపై అవగాహన రావడంతో చదవడం తేలికైంది. జాతీయ స్థాయిలో ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది.

– తేజస్విని, కాకతీయ

కౌన్సెలింగ్‌ ఇచ్చేవారు



జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో మంచి మార్కులు సాధించడానికి కళాశాల బోధకులే కారణం. ఎలాంటి సందేహాలు లేకుండా పలుమార్లు కౌన్సిలింగ్‌ నిర్వహించి సన్నద్ధం చేశారు. దీంతో తేలికగా మార్కులు సాధించడానికి వీలైంది. జాతీయ స్థాయిలో మంచి మార్కులు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది.

– సుప్రిత్‌, కాకతీయ

పాఠశాల స్థాయిలోనే పట్టు



జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో మంచి మార్కులు సాధించాను. నేను పాఠశాల స్థాయిలోనే పట్టుసాధించాను. కాకతీయ ఒలంపియాడ్‌ పాఠశాలలో చదవడం వల్లే ఐఐటీపై మంచి పట్టు లభించింది. దీంతో తేలికగా జాతీయ స్థాయి ర్యాంకు సాధించగలిగాను. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ని అవుతా.

– మిన్హాజ్‌, కాకతీయ

ఉత్సాహం లభించింది



ప్రణాళికాబద్ధంగా మంచి మార్కులు సాధించేందుకు కష్టపడ్డాను. ఐఐటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు ప్రతి సబ్జెక్టుపై అధ్యాపకులు బోధన చేపట్టారు. ఇది ఎంతగానో ఉపయోగపడింది. జాతీయ స్థాయి పరీక్షల్లో మరింతగా రాణించేందుకు ఉత్సాహం లభించింది.

– శివప్రథమ్‌, కాకతీయ

ఇంటర్‌ ఫలితాల్లో ‘కేజీబీవీ’ ప్రతిభ


విద్యార్థినులతో డీఈవో దుర్గాప్రసాద్‌, కేజీబీవీ ఇన్‌చార్జి వనిత

నిజామాబాద్‌అర్బన్‌: కేజీబీవీల విద్యార్థినులు ఇంటర్‌ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్‌ గురువారం విద్యార్థినులను అభినందించారు. ఫస్టియర్‌లో 68 శాతం, సెకండ్‌ ఇయర్‌లో 75 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, మొత్తం 68 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌ మొదటి సంవత్సరంలో డిచ్‌పల్లి కేజీబీవీకి చెందిన నందిని ఎంపీసీలో 464/470, శైలజ 464/470, బైపీసీలో అర్థిక 434/440 మార్కులు సాధించారు. బాల్కొండ కేజీబీవీకి చెందిన రితిక ఇంటర్‌ మొదటి సంవత్సరం సీఈసీలో 472/500 మార్కులు సాధించారు. జక్రాన్‌పల్లి కేజీబీవీకి చెందిన రమ్య ఇంటర్‌ మొదటి సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో 488 మార్కులు సాధించారు. ఇంటర్‌ రెండో సంవత్సరం ఎంపీసీ విభాగంలో డిచ్‌పల్లి కేజీబీవీకి చెందిన రోజా 961/1000 మార్కులు, ఇదే కళాశాలకు చెందిన శర్యణ బైపీసీలో 944/1000 మార్కులు సాధించారు. నిజామాబాద్‌ కేజీబీవీకి చెందిన శ్రీవాణి సీఈసీలో 938 , బాల్కొండకు చెందిన వైష్ణవి 966 మార్కులు సాధించారు. వచ్చే ఏడాది మరింత ఉత్తమ ఫలితాలు సాధిస్తామని కేజీబీవీ ఇన్‌చార్జి వనిత అన్నారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ


బి.వర్ష


టి.తేజశ్రీ


ఎస్‌.కృతజ్ఞ


వై.సంధ్య


ఎం.అపూర్వ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు తమ సత్తా చాటారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా (సీవోఈ) కళాశాల విద్యార్థినులు 15 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్‌ బి.సంగీత తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు బి.వర్ష 92.44, టి.తేజశ్రీ 90.87, ఎస్‌.కృతజ్ఞ 86.76, వై.సంధ్య 85.71, ఎం.అపూర్వ 79.46 పర్సంటైల్‌ (టాప్‌ 5) సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మే 2 వరకు సప్లిమెంటరీ ఫీజు గడువు

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు మే 2వ తేదీ వరకు ఉందని జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రవికుమార్‌ తెలిపారు. మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తే బోర్డు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రీ కౌంటింగ్‌, రీ వాల్యుయేషన్‌తోపాటు ఇంప్రూవ్‌మెంట్‌ కోసం కూడా ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీకౌంటింగ్‌ కు రూ.100, రీ వాల్యుయేషన్‌కు రూ.600 ఫీజు ఉంటుందని తెలిపారు.

క్రైం కార్నర్‌

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

ధర్పల్లి: మద్యానికి బానిసై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. బుధవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన గాడిదల గంగాధర్‌ (25) కూలీ పని చేసేవాడు. పని చేయగా వచ్చిన డబ్బులతో ప్రతిరోజూ మద్యం సేవించేవాడు. మద్యానికి బానిసైన గంగాధర్‌ జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): అన్నపై తమ్ముడు దాడిచేసిన ఘటన ఎల్లారెడ్డి మండలం కొక్కొండ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొక్కొండకు చెందిన దర్శనాల సైదులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో జీవిస్తుండగా, అతడి తమ్ముడు దర్శనాల రవి గ్రామంలో ఉంటున్నాడు. రవి తన తల్లిపై దాడి చేసినట్లు తెలుసుకున్న సైదులు కొక్కొండకు వస్తుండగా అడివిలింగాల గేటు వద్ద అతడిని రవి అడ్డుకుని రాయితో దాడి చేశాడు. ఈ ఘటనలో సైదులుకు తీవ్రగాయాలయ్యాయని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


బస్సును ఢీకొన్న కారు

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని పోసాన్‌పల్లి గేట్‌ వద్ద ఆర్టీసీ బస్సును వెనక నుంచి కారు ఢీకొట్టినట్లు స్థానికులు గురువారం తెలిపారు. కామారెడ్డి నుంచి నిజాంసాగర్‌కు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుందని, కారులోని పలువురికి స్వల్ప గాయాలయ్యాయన్నారు. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ గురువారం తెలిపారు. చాకెట్ల కోసం బుధవారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక తిరిగిరాలేదని, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డైరెక్టర్‌ విశ్వనాథ్‌రెడ్డి

డిచ్‌పల్లి: స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) అందిస్తున్న ఉచిత శిక్షణ ద్వారా నిరుద్యోగ యువతకు చక్కటి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డైరెక్టర్‌ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐని గురువారం ఆయన సందర్శించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అవసరమైతే ఎస్‌బీఐ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. నాణ్యమైన శిక్షణ అందిస్తున్న సంస్థ డైరెక్టర్‌ సుంకం శ్రీనివాస్‌, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సిఎబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్‌, నవీన్‌, ఫ్యాకల్టీ శ్రీలత, ఫరీరా, శిక్షణ పొందుతున్న మహిళా అభ్యర్థులు పాల్గొన్నారు.

గడ్కోల్‌లో మృతదేహంతో ఆందోళన

- దాడి చేశారని అవమానంతో వ్యక్తి ఆత్మహత్య
- పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు


బైఠాయించిన మృతుడి బంధువులు

సిరికొండ: తనపై దాడి చేశారని మనస్తాపంతో మండలంలోని గడ్కోల్‌కు చెందిన గుర్రాల రవీందర్‌ బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన మల్కి లలిత ఇంటి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు గురువారం ఉదయం రవీందర్‌ మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాత కక్షల నేపథ్యంలో లలితతోపాటు ఆమె బంధువులు గత నెల 30వ తేదీన రవీందర్‌పై దాడి చేశారు. ఈ విషయమై రవీందర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రవీందర్‌ బుధవారం తన పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం గ్రామానికి రవీందర్‌ మృతదేహాన్ని గురువారం తీసుకువచ్చారు. మృతుడి భార్య శ్యామలతోపాటు బంధువులు లలిత ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. రవీందర్‌ ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలని కోరుతూ మృతదేహాన్ని ఉంచి ఐదు గంటలపాటు బైఠాయించారు. సమాచారం అందుకున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌ గ్రామానికి చేరుకొని మృతుడి బంధువులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్యామల ఏసీపీతో మాట్లాడుతూ.. తన భర్త రవీందర్‌ తనపై దాడి జరిగిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రవీందర్‌పై దాడికి కారణమైన లలితోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మిగతా వారిని కూడా అరెస్ట్‌ చేస్తామని తెలిపారు. ఇంకా ఎవరిపైనైనా అనుమానం ఉంటే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏసీపీ హామీతో బాధితులు ఆందోళన విరమించారు. సిరికొండ, ధర్పల్లి ఎస్సైలు రమేశ్‌, విక్రమ్‌ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పోలీసు బందోబస్తు మధ్య రవీందర్‌ అంత్యక్రియలను పూర్తి చేశారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు పోలీసులు గ్రామంలోనే ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నీరేశ్‌

పిట్లం(జుక్కల్‌): మండలంలోని గద్దగుండుతండా సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా వట్టపల్లి మండలం భూత్కూర్‌ గ్రామానికి చెందిన బేగరి సుభాష్‌ (25) బైక్‌పై పిట్లం నుంచి బుధవారం రాత్రి 11గంటలకు సంగారెడ్డి వైపు వెళ్తున్నాడు. గద్దగుండు తండా సమీపంలో జాతీమ రహదారిపై బైక్‌ను డీసీఎం ఢీకొట్టగా సుభాష్‌ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి..

డిచ్‌పల్లి: మండలం గొల్లపల్లికి చెందిన కంజర్‌ చిరంజీవి(40) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. కూలీ పని చేస్తూ జీవించే చిరంజీవి అమృతాపూర్‌లో ఉంటున్నాడు. ఈనెల 21న రాత్రి ప్రమాదవశాత్తు మంచం పైనుంచి కిందపడిపోగా తలకు గాయమైంది. అప్పటి నుంచి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిరంజీవి గురువారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య శమంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి గాయాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం మూలమలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డి వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న తూఫాన్‌ వాహనం వేగంగా వచ్చి టీవీఎస్‌ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎల్లారం గ్రామానికి చెందిన రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న కాంగ్రెస్‌ నాయకులు సంతోష్‌రెడ్డి, ఫతియొద్దీన్‌, రాజు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

రూ.4.22 లక్షల నగదు స్వాధీనం

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ) : జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వేర్వేరు వ్యక్తుల నుంచి గురువారం రూ.4,22,900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. నాందెడ్‌ జిల్లా బోకర్‌కు చెందిన రాథోడ్‌ రమేశ్‌ నుంచి రూ.2,88,500, జల్‌గావ్‌కు చెందిన జాహంర్‌ భాయ్‌ నుంచి రూ.1,34,400 సీజ్‌ చేశామన్నారు. ప్రయాణికులు తమ వెంట రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లొద్దని సూచించారు. ఆమె వెంట ఏఎస్సై వెంకట్రావ్‌, సిబ్బంది సుభాష్‌, ఎంపీడీవో నీలావతి ఉన్నారు.

పాత నేరస్తుల బైండోవర్‌



భిక్కనూరు: ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్తులను పోలీసులు గురువారం బైండోవర్‌ చేశారు. భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్‌, ఎస్సై సాయికుమార్‌ పాత నేరస్తులను పిలిపించి వారికి కౌన్సిలింగ్‌ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కౌన్సిలింగ్‌ అనంతరం వారిని తహసీల్దార్‌ శివప్రసాద్‌ ఎదుట బైండోవర్‌ చేశారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్‌

బోధన్‌రూరల్‌: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిని పోక్సో కేసులో రిమాండ్‌కు తరలించినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. యువకుడు గ్రామానికి చెందిన బాలికను ఈ నెల 5న హైదరాబాద్‌కు తీసుకెళ్లి వివాహం చేసుకొని శారీరకంగా వాడుకున్నాడు. బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు యువకుడిని గురువారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

మహిళపై గొడ్డలితో దాడి

ధర్పల్లి: భూ వివాదంలో మహిళపై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని గోవింద్‌పల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గోవింద్‌పల్లి గ్రామానికి చెందిన దొడ్డనక గోపి కుటుంబానికి, దొడ్డనక సుగుణ కుటుంబానికి మధ్య కొద్ది రోజులుగా భూవివాదం నెలకొంది. సుగుణ పేరు మీద ఉన్న భూమి తనకే చెందుతుందని గోపి గతంలో సుగుణ కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. సుగుణ కుటుంబ సభ్యుల కారణంగా తనకు ఆస్తి నష్టం జరిగిందని గోపి గ్రామంలో వాల్‌పోస్టర్లను అతికించాడు. ఈ విషయమై గురువారం ఉదయం సుగుణ కుటుంబీకులు గోపిని ప్రశ్నించగా.. సుగుణ కూతురు, కొడుకుపై గోపి గొడ్డలితో దాడికి యత్నించాడు. ఈ క్రమంలో అడ్డుకునేందుకు వెళ్లిన సుగుణపై దాడి చేయడంతో సుగుణ ఛాతి, మెడ భాగంలో తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలి కూతురు లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.